క్లుప్తంగా

భక్తులకు అన్నసమారాధన



అన్నసమారాధనలో భక్తులు

రాజవొమ్మంగి: మండల కేంద్రంలోని షిర్డీ సాయిబాబా ఆలయం వద్ద గురువారం అన్న సమారాధన వైభవంగా జరిగింది. దాతలు ఇచ్చిన కూరగాయలు, ఆర్థిక సాయం, ఇతర దినుసులతో ఆలయ కమిటీ సభ్యులు ఆలయ ప్రాంగణంలో వంటలు చేసి భక్తులకు వడ్డించారు. పరిసర గ్రామాల నుంచి విశేషంగా భక్తులు హాజరై తీర్థప్రసాదాలు స్వీకరించారు. భక్తులు భక్తి శ్రద్ధలతో హారతులు, పూజలు, భజన కీర్తనల్లో పాల్గొన్నారు. ఈ సందర్భంగా బాబా వారిని ప్రత్యేకంగా అలంకరించారు.

ఆశ్రమ పాఠశాలలో ప్రవేశానికి దరఖాస్తులు

ముంచంగిపుట్టు: మండలంలోని జోలాపుట్టు ప్రభుత్వ గిరిజన సంక్షేమ ఆశ్రమ బాలిక పాఠశాలలో ప్రస్తుత విద్యా సంవత్సరంలో ప్రవేశాలకు దరఖాస్తులు ఆహ్వానిస్తున్నట్టు హెచ్ఎం నిర్మల కోరారు.ఆమె గురువారం విలేకరులతో మాట్లాడుతూ పాఠశాలలో వివిధ తరగతుల్లో మొత్తం 142 ఖాళీలు ఉన్నట్టు చెప్పారు.ఇందులో భాగంగా 3వ తరగతిలో- 40, 4వ తరగతిలో-36, 5వ తరగతిలో-29, ఆరో తరగతిలో-24, 8వ తరగతిలో-13 చొప్పున ఖాళీలు ఉన్నాయన్నారు. ఆయా తరగతుల్లో చేరేందుకు ఆసక్తి గల విద్యార్థులు తమ తల్లిదండ్రులతో పాఠశాలకు వచ్చి దరఖాస్తులు చేసుకోవాలని సూచించారు. పాఠశాలలో 7, 9, 10 తరగతుల్లో సీట్లు ఖాళీలు లేనట్టు తెలిపారు.

చిన్నారులకు బహుమతులు



బహుమతులిస్తున్న సర్పంచ్ వెంకటపూర్ణిమ, గ్రంథాలయ అధికారి మానస

హుకుంపేట: చిన్న తనం నుంచే మంచి విద్య అందిస్తేనే చిన్నారులకు బంగారు భవిష్యత్ ఉంటుందని సర్పంచ్ సమిడ వెంకటపూర్ణిమ అన్నారు. స్థానిక గ్రంథాలయంలో గ్రంథాలయ అధికారి మానస ఆధ్వర్యంలో నిర్వహించిన వేసవి శిబిరాలు గురువారంతో ముగిశాయి. ఈ సందర్భంగా వేసవి శిబిరాల్లో భాగంగా మే 15 నుంచి ఈ నెల 6వ తేదీ వరకు సుమారు 24 రోజుల పాటు నిర్వహించిన వ్యాసరచన, డ్రాయింగ్ ఇతరత్రా ఆటల పోటీల్లో విజేతలకు బహుమతులును సర్పంచ్ సమిడ వెంకటపూర్ణిమ అందజేశారు. వైస్ సర్పంచ్ గోవింద్, సీపీఎం నాయకుడు కృష్ణారావు తదితరులు పాల్గొన్నారు.

నూకాంబికకు చీరలతో అలంకరణ



చీరలతో భక్తులకు దర్శనం ఇస్తున్న తాకాశివీధి నూకాంబిక అమ్మవారు

అనకాపల్లి: స్థానిక తాకాశివీధి నూకాంబిక అమ్మవారిని అమావాస్య పురస్కరించుకుని భక్తులు సమర్పించిన 101 చీరలతో గురువారం అలంకరించారు. అధిక సంఖ్యలో భక్తులు పాల్గొని, అమ్మవారిని దర్శించుకున్నారు. ప్రత్యేక పూజలు చేశారు. కార్యక్రమంలో ఆలయ కమిటీ సభ్యులు, వీధి పెద్దలు, భక్తులు పాల్గొన్నారు.

ఎన్ఎంఎంఎస్‌లో సత్తా చాటిన విద్యార్థులు

కోటవురట్ల: నేషనల్ మీన్స్ కం మెరిట్ స్కాలర్‌షిప్ పరీక్షలో సత్తా చాటిన పలువురు విద్యార్థులు స్కాలర్‌షిప్‌కు ఎంపికయ్యారు. రాజుపేట ఎంపీయూపీ స్కూల్‌కు చెందిన విద్యార్థులు దుబాసి యశస్విని, మళ్ల చర్మిళ, సూరిశెట్టి రష్మిత, తీడ వెంకట రాజ్‌కుమార్, ఎత్తుల శివదుర్గ స్కాలర్‌షిప్‌కు ఎంపికయ్యారు. దాంతో ప్రధానోపాధ్యాయుడు షేక్ ఖాలీషా, ఉపాధ్యాయులు విద్యార్థులను అభినందించారు. మిగతా విద్యార్థులు స్ఫూర్తిగా తీసుకుని ఉత్తమ ఫలితాల సాధనకు పట్టుదలగా కృషి చేయాలన్నారు.

మన్యంలో పనస సిరులు

- మార్కెట్‌లో గిరాకీ
- ఆశాజనకంగా ధరలు
- ఆనందంలో రైతులు



వాహనంలో మైదాన ప్రాంతానికి తరలిస్తున్న పనసకాయలు



గిరిజనులు విక్రయించటానికి తీసుకొచ్చిన పనసకాయలు

జి.మాడుగుల: అల్లూరి జిల్లా ఏజెన్సీ ప్రాంతంలో ఈ ఏడాది పనసకాయల దిగుబడి బాగుంది. ఆశించిన స్థాయి కంటే ఎక్కువగా ఉందని గిరిజన రైతులు ఆనందం వ్యక్తం చేస్తున్నారు. ఈ కారణంగా పనసకాయలకు కొనుగోలుకు గ్రామాల్లోను, వారపు సంతల్లో వ్యాపారులు ఎగబడుతున్నారు. గిరిజనులు తమ పంట భూముల్లోను, అటవీ ప్రాంతాల్లో ప్రతీ ఏటా పనసచెట్లు నుండి అధిక సంఖ్యలో పనసకాయలు పంట దిగుబడి లభిస్తుంది. ఏజెన్సీ పనసకాయలు, పనస పండ్లకు మైదాన ప్రాంతాల్లో మంచి డిమాండ్ ఉంది. ఇక్కడి పనస చాలా రుచికరంగా, మధురంగా ఉండడంతో గిరాకీ ఉంది. దీంతో ఇతరత్రా ప్రాంతాల నుంచి వ్యాపారులు వచ్చి కొనుగోలు చేస్తుంటారు. దీంతో గిరిజన గ్రామాల్లోను, వారపు సంతలకు గిరిజనులు తీసుకొచ్చిన పనసకాయలు హాట్‌కేక్‌ల్లా అమ్ముడైపోతున్నాయి. కొంతమంది రైతులు చింతపల్లి మండలం చిత్రలగొప్పు తదితర ప్రాంతాలకు ఆటోలు, జీపులు, వ్యాన్‌లలో తరలిస్తున్నారు. విశాఖపట్నం, నర్సీపట్నం, విజయనగరం తదితర ప్రాంతాల నుంచి వస్తున్న వ్యాపారులకు విక్రయిస్తున్నారు. మంచి ధరలు పలుకుతుండండతో గిరిజన రైతులు అధిక ఆదాయం పొందుతున్నారు. గిరిజన ప్రాంతాల్లో పనసకాయలు సీజన్ వల్ల ప్రస్తుతం డిమాండ్‌తో పాటు ధరలు పలుకుతున్నాయి.ఏజెన్సీ ప్రాంతంలో ఎక్కువగా కజ్జా, కొబరి, బురద పేర్లతో పనసకాయలు పండుతున్నాయి. కజ్జా, కొబరి రకాల పనసకాయలు సుమారు 10కిలోలు బరువు ఉంటుంది.. ప్రస్తుతం వీటి ధరలు రూ.100 నుంచి రూ.200ల వరకు పలుకుతున్నాయి. పాడేరు నియోజకవర్గంలోని కొయ్యూరు, గూడెం కొత్తవీధి, చింతపల్లి, జి.మాడుగుల, పాడేరు మండల్లాల్లో 3000 హెక్టార్లకు పైగా విస్తీర్ణం పనసతోటలు ఉండగా ఎకరా భూమిలో 50 నుంచి 70 చెట్లు చొప్పున 3 లక్షల నుంచి 3.50 లక్షలకు పైగా పనసచెట్లు ఉన్నట్లు అంచనా. మండలానికి 1000 నుంచి 1500మంది చొప్పున సుమారు 6000 మందికి పైగా పనస రైతులు ఉన్నట్టు వ్యవసాయ శాఖ లెక్కలు చెబుతున్నాయి. మార్కెట్‌ను బట్టి ప్రస్తుత సీజన్‌లో రూ.3వేల నుంచి రూ.6వేలకు పైగా వరకు ఆదాయం వస్తోందని పలువురు రైతులు చెబుతున్నారు. పనసకాయల సాగుకు ఎటువంటి వ్యవసాయ ఖర్చులు లేకుండా ప్రతీ సంవత్సరం వచ్చే ఆదాయంతో కుటుంబ ఖర్చులకు కొంత సరిపోతుందని పలువురు రైతులు చెబుతున్నారు.



గడుతూరు గ్రామంలో విరగ్గాసిన పనసచెట్టు

లాభదాయకంగా ధర



పనసకాయలకు గిట్టుబాటు ధర లభిస్తుంది. ఈ ఏడాది పనసకాయలు దిగుబడి వచ్చింది. కాయల సైజును బట్టి ధర రూ.150 రూ.200లకు పలుకుతుంది. వ్యాపారులు గ్రామాల్లోను, వారపు సంతలకు వచ్చి పనసకాయలు కొనుగోలు చేస్తున్నారు. దీంతో ఆశించిన ధరలున్నారు. రానున్న రోజుల్లో మార్కెట్ పెరిగి మరింత ధరలు వచ్చే అవకాశాలున్నాయి.

– చిన్నమత్స్యకొండబాబు, రైతు, గడుతూరు గ్రామం, జి.మాడుగుల మండలం

పాఠశాలలు పునఃప్రారంభం నాటికి

విద్యార్థులు హాజరు కావాలి

జి.మాడుగుల: ప్రభుత్వ గిరిజన సంక్షేమ ఆశ్రమ పాఠశాలలు పునఃప్రారంభం నాటికి విద్యార్థులందరు హాజరుకావాలని ఏటీడబ్ల్యూవో ఎ.తిరు పాల్ తెలిపారు. ఆయన గురువారం విలేకరులతో మాట్లాడుతూ పాఠశాలలకు వచ్చే విద్యార్థులకు వైద్య పరీక్షలు నిర్వహించాలని, పాఠశాలలు ప్రారంభం నాటికి విద్యార్థులందరు హాజరయ్యే విధంగా పాఠశాల సిబ్బంది దృష్టి సారించాలన్నారు. ప్రభుత్వ కళాశాలలు ప్రారంభమైనా విద్యార్థులు ఇంకా చేరుకోలేదని తక్షణమే యాజమాన్యం విద్యార్థులను కాలేజీలకు రప్పించాలని ఆయన్నారు.



ఏటీడబ్ల్యూవో తిరుపాల్

చింతపల్లిరూరల్: విద్యార్థులు పాఠశాల పునఃప్రారంభం రోజు హాజరుకావాలని స్థానిక ఏటీడబ్ల్యూవో జయనాగలక్ష్మి అన్నారు. ఆమె విలేకరులతో గురువారం మాట్లాడుతూ గిరిజన సంక్షేమ శాఖ ఆశ్రమ పాఠశాలల ఈ నెల 12న పునఃప్రారంభం అవుతాయన్నారు. వేసవి సెలవులకు వెళ్లిన విద్యార్థులు తొలి రోజే పాఠశాలలకు హాజరుకావలాన్నారు. ఇళ్ల నుంచి విద్యార్థులను వాళ్ల తల్లిదండ్రులు మాత్రమే వచ్చి పాఠశాలకు అప్పగించాలన్నారు. పాఠశాలలో 3వ తరగతి నుంచి 9 వ తరగతి వరకు ఖాళీ సీట్లు ఉన్నాయని ఆసక్తి గల వారు దరఖాస్తులు చేసుకోవాలన్నారు. దీనికి సంబంధించిన వివరాలు ఆయా పాఠశాలల నోటిసు బోర్డులో ప్రదర్శించామన్నారు.

నేడు వాసవీమాత ఆలయ వార్షికోత్సవం

మాడుగుల రూరల్: మండలంలో జంపెనలో వాసవీమాత ఆలయ ఆరో వార్షికోత్సవం శుక్రవారం ఘనంగా నిర్వహించనున్నట్లు కింతలి గాదిరాయి వాసవీ క్లబ్ వ్యవస్థాపక అధ్యక్షుడు, ఆలయ కమిటీ చైర్మన్ పుట్టా మోహన్‌రావు గురువారం ఒక ప్రకటనలో తెలిపారు. కింతలి - గాదిరాయి వాసవీ సంఘ సభ్యులు ఆధ్వర్యంలో ఈ కార్యక్రమం నిర్వహిస్తున్నట్లు పేర్కొన్నారు. అమ్మవారికి ఉదయం కుంకుమార్చన, క్షీరాభిషేకం నిర్వహిస్తామన్నారు. మాడుగుల నియోజకవర్గంలో ఆర్యవైశ్యులు హాజరు కావాలని కోరారు. ఆలయం వద్ద చినానరులకు ఆటల పోటీలు, మహిళలకు పాటలు పోటీలు నిర్వహించి బహుమతులు అందజేస్తామన్నారు. ఉదయం అల్పాహారం, మధ్యాహ్నం భోజన సదుపాయం కల్పిస్తామన్నారు.

వంతెనల నిర్మాణం.. అనివార్యం

- వానొచ్చినా, వరదొచ్చినా నిలిచిపోతున్న రాకపోకలు
- రెండు మండలాలు, 11 గ్రామాల ప్రజలకు ఎంతో మేలు
- వరద కట్టడికి వారధుల కోసం స్థానికుల వినతి



చప్టాపై నుంచి ప్రవహిస్తున్న జల్లివారిగూడెం వాగు నీరు (ఫైల్)

చింతూరు: వర్షాకాలం వచ్చిందంటే చాలు చింతూరు మండలంలోని 11 గ్రామాల ప్రజలకు దశాబ్దాలుగా ఇబ్బందులు తప్పడంలేదు. చిన్నపాటి వర్షానికే ఆయా గ్రామాలకు రాకపోకలు నిలిచిపోతున్నాయి. దీంతోపాటు చింతూరు, వీఆర్ పురం మండలాల నడుమ కూడా రోజల తరబడి రాకపోకలు కొనసాగకపోవడంతో ఈ రహదారిలోని అనేక గ్రామాల ప్రజలు ఇబ్బందులు పడుతున్నారు. ఈ రహదారిలో ఉన్న వాగులపై వంతెనల నిర్మాణంతోనే తమ కష్టాలు తీరుతాయని ఆయా గ్రామస్తులు చెబుతున్నారు. చింతూరు, వీఆర్ పురం మండలాల నడుమ చింతూరు మండలంలో చూటూరు, నర్సింగపేట నడుమ సోకిలేరువాగు, తిమ్మిరిగూడెం, ఏజీ కొడేరు నడుమ జల్లివారిగూడెం వాగు, వీఆర్ పురం మండలంలో అన్నవరం, ఉమ్మిడివరం నడుమ అన్నవరం వాగులు వర్షాకాలంలో ఉధృతంగా ప్రవహిస్తుంటాయి. దీంతో పలు ప్రాంతాలకు వెళ్లేందుకు రాకపోకలు నిలిచిపోతుంటాయి. వరద ఉధృతి తగ్గే వరకు గ్రామస్తులకు తరచూ ఇబ్బందులు తప్పవు.. సహాయక చర్యలు కూడా అందలేని పరిస్థితి ఉంటుంది.

సోకిలేరు వాగుతో అధిక కష్టాలు

చింతూరు మండలంలోని సోకిలేరు వాగు కారణంగా ప్రతి ఏడాది మండలంలోని ముకునూరు, నర్సింగపేట, తిమ్మిరిగూడెం, ఏజీ కొడేరు, మల్లెతోట, ఉలుమూరు, రామన్నపాలెం, బొడ్రాయిగూడెం, చినసీతనపల్లి, పెదసీతనపల్లి, కొండపల్లి గ్రామాల ప్రజలు ఇబ్బందులు పడుతున్నారు. దీంతో పాటు చింతూరు, వీఆర్ పురం మండలాల నడుమ కూడా రాకపోకలు నిలిచిపోతున్నాయి. ఎగువ ప్రాంతంలో కురిసే భారీ వర్షానికి ఈ వాగులో లెవల్ వంతెనపై నుంచి ఉధృతంగా ప్రవహిస్తూ రాకపోకలకు అంతరాయం కలుగిస్తోంది. అలాగే గోదావరి, శబరి నదుల నీటి మట్టాలు పెరిగితే సోకిలేరు వాగు ఎగపోటుకు గురై కూడా రాకపోకలు నిలిచిపోతున్నాయి. ఇక్కడ హైలెవల్ వంతెన నిర్మించడం ద్వారా వరదను కట్టడి చేసే అవకాశముంది.

ఇసుకమేటతో ఇబ్బందులు

మండలంలోని జల్లివారిగూడెం వాగు ఇసుక మేటలతో నిండిపోవడంతో చిన్నపాటి వర్షానికే వరద నీరు చప్టాపై నుంచి ప్రవహిస్తుండడంతో రాకపోకలు నిలిచిపోతున్నాయి. ఇక్కడ ఇసుకమేటలు తొలగించడంతో పాటులో లెవల్ వంతెన నిర్మించడం ద్వారా వరదనీరు రహదారి పై నుంచి ప్రవహించకుండా నిలువరించే అవకాశముంది. దీనిపై ఎంపీపీ సవలం అమల మాట్లాడుతూ ఈ విషయాన్ని అధికారుల దృష్టికి తీసుకెళ్లి జల్లివారిగూడెం వాగులో పూడిక తీయించి లోలెవల్ వంతెన నిర్మాణం కోసం నివేదిస్తామన్నారు.



వర్షాలకు ముంపునకు గురవుతున్న సోకిలేరు వాగు ప్రాంతం (ఫైల్)

నైపుణ్యతను వెలికితీసేందుకు వేసవి శిబిరాలు



వేసవి శిబిరంలో పాల్గొన్న చిన్నారులతో నిర్వాహకులు

ముంచంగిపుట్టు: పిల్లల్లో ఉన్న నైపుణ్యతను వెలికితీసేందుకు సమ్మర్ క్యాంప్‌ను నిర్వహింస్తున్నట్టు గిరిజన మహిళ సంఘం(ఐద్వా)మండల అధ్యక్షురాలు సోనియా ఈశ్వరి అన్నారు. మండల కేంద్రంలో గత 12 రోజులుగా గిరిబాల నేస్తం క్లబ్, ఆసరా చారిటబుల్ సొసైటీ, గౌతు లచ్చన్న బలహీన వర్గ సంస్థలు సంయుక్తంగా నిర్వహించిన సమ్మర్ క్యాంపు గురువారంతో ముగిసింది. సమ్మర్ క్యాంపులో పాల్గొన్న పిల్లలకు క్యారం బోర్డులు, స్కిప్పింగ్, చెస్ బోర్డు వంటి ఆటల సామగ్రిను అందజేశారు. ఈ సందర్భంగా పలువురు మాట్లాడుతూ క్రీడల పట్ల ఆసక్తి కలిగిన చిన్నారులను ఈ దశలోనే ప్రోత్సహిస్తే భవిష్యత్తులో ఉన్నత శిఖరాలను చేరుకుంటారన్నారు. తల్లిదండ్రుల సహకారంతో పిల్లలు ఈ సమ్మర్ క్యాంప్‌ను బాగా వినియోగించుకున్నారని, పిల్లలకు విజ్ఞానం, వినోదం, వికాసం వంటి అంశాలపై బోధించడం జరిగిందన్నారు. గిరిజన మహిళ సంఘం మండల కార్యదర్శి విజయ, గిరిజన మహిళ సంఘం మండల సభ్యులు రజిని, దేవి, మీనా, దసుధ, లక్ష్మీ, జీవన తదితరులు పాల్గొన్నారు.

పచ్చిరొట్టతో భూమికి సారం



విత్తనాలు పంపిణీ చేస్తున్న ఏవో ఉమాదేవి

కొయ్యూరు: పచ్చిరొట్ట విత్తనాలు వేయడం ద్వారా భూమిని సారవంతంగా చేయవచ్చని ఏవో ఉమాదేవి సూచించారు. చీడిపాలెం రైతు భరోసా కేంద్రంలో రైతులకు పచ్చిరొట్ట విత్తనాలను ఆమె గురువారం పంపిణీ చేశారు.ఆమె మాట్లాడుతూ నాట్లు వేసేందుకు ముందు ఈ విత్తనాలు పొలంలో చల్లాలని చెప్పారు.దీని మూలంగా భూమిలో కార్బన్, నత్రజని శాతం పెరిగి మేలు చేస్తుందన్నారు. 90శాతం సబ్సిడిపై విత్తనాలు అందజేస్తున్నామన్నారు. పది కిలోల విత్తనాలను రూ.88కి ఇస్తున్నామన్నారు. పూత దశలో రైతులు దీనిని కలియ దున్నాలని సూచించారు. ప్రతీ రైతు వినియోగించుకోవాలని కోరారు. వీఏఏ ఉష తదితరులు పాల్గొన్నారు.

సీజనల్ వ్యాధులపై అప్రమత్తం



వట్టిగెడ్డలోని వైద్య శిబిరంలో ఆరోగ్య పరీక్షలు చేస్తున్న వైద్యులు, సిబ్బంది

రాజవొమ్మంగి: మండలంలోని వట్టిగెడ్డ గ్రామంలో బుధవారం ఏర్పాటు చేసిన ఫ్యామిలీ డాక్టర్ వైద్య శిబిరంలో స్థానికులను రాజవొమ్మంగి పీహెచ్‌సీ డాక్టర్ సుష్మ కోరారు. హెల్త్ సబ్‌సెంటర్లో ఏర్పాటు చేసిన ఈ శిబిరంలో ఆమె 70 మంది రోగులను పరీక్షించి అవసరమైన వైద్య సలహాలు, సూచనలు ఇచ్చారు. బీపీ సుగర్ సమస్యలు ఉన్నవారికి మందులు ఇచ్చారు. గర్భిణులు, బాలింతలకు పరీక్షలు చేసి ఆరోగ్య సూచనలిచ్చారు. రక్తహీనత పరీక్షలు చేసి పాటించాల్సిన జాగ్రత్తలను వివరించారు. 104 డీఈఓ శ్రీనివాస్, ఎంఎల్‌హెచ్‌పీ సంపత్, హెచ్.వి.రమాబాయి, హెల్త్ అసిస్టెంట్ నాయుడుబాబు, ఏఎన్ఎం సన్యాసమ్మ, పైలెట్ కనకరాజు తదితరులు పాల్గొన్నారు.

రేవళ్లులో పాఠశాలను ఏర్పాటు చేయాలి



మూతబడిన రేవళ్ల పాఠశాల

కొయ్యూరు: సుమారు 80 మంది పిల్లలున్న రేవళ్ల గ్రామంలో పాఠశాల లేకపోవడంతో దూరంగా వెళ్లి చదువుకునేందుకు ఇబ్బందులు పడుతున్నారు. గతంలో ఇక్కడ ఉన్న ఎయిడెడ్ పాఠశాల మూతబడిన నుంచి కొత్త పాఠశాలను ఏర్పాటు చేయలేదు. దీంతో స్థానిక విద్యార్థులు ఏడు కిలోమీటర్ల దూరంలో ఉన్న రాజేంద్రపాలెం, కొయ్యూరు పాఠశాలలకు వచ్చి చదువుకుంటున్నారు. బస్సులు లేదా ఆటోల్లో రోజూ పిల్లలు రాకపోకలు సాగిస్తుంటారు. చిన్న పిల్లలు కావడంతో తలిదండ్రులు ఆందోళన చెందుతున్నారు. ఈ యేడాదైన పాఠశాలను ఏర్పాటు చేయాలని కోరుతున్నారు.గతంలో కలెక్టర్ సుమిత్‌కుమార్‌కు సమస్యపై వినతి ఇచ్చామని పలువురు విద్యార్థుల తల్లిదండ్రులు చెబుతున్నారు. ప్రస్తుత కలెక్టర్ విజయసునీతను కూడా కలిసి పాఠశాలను మంజూరు కోసం కోరామంటున్నారు. ఇప్పటికైనా విద్యాశాఖ ఉన్నతాధికారులు స్పందించి రేవళ్ల గ్రామంలో పాఠశాలను ఏర్పాటుచేయాలని కోరుతున్నారు. దీనిపై డీఈవో బ్రహ్మాజీరావును కోరగా పాఠశాలను తప్పక ఏర్పాటు చేస్తామన్నారు. సెలవులు పూర్తయి పాఠశాలలు తెరిచే నాటికి అక్కడ పాఠశాల ఏర్పాటుకు చర్యలు తీసుకుంటామన్నారు.

సేంద్రియ సాగుపై అవగాహన



ప్రకృతి వ్యసాయంలో పండించిన ఆకుకూరలు, కూరగాయలతో ప్రదర్శన

రాజవొమ్మంగి: రసాయన ఎరువులు లేకుండా పండించే కూరగాయల సాగుపై అధికారులు మన్యం రైతులు ఆసక్తి కనపరుస్తున్నారు. ఇందులో భాగంగా పాలేకర్ ప్రకృతి వ్యవసాయ చక్రం (జెడ్.బీ.ఎన్.ఎఫ్ వీల్)పై మండలంలోని ఉర్లాకులపాడు ప్రకృతి వ్యవసాయక్షేత్ర సిబ్బంది రైతులకు వివరిస్తున్నారు. చక్రంలో గల నాలుగు భాగాల్లో ఒకటి- జీవామతం , రెండు- భీజామతం, మూడు- అఛ్ఛాదన (మలిచ్ంగ్) నాలుగు- వాప్స అనగా గాలిలోని తేమను కాపాడుకొనే విధానాలను వివరించారు. ఈ నాలుగు విధానాలు ఉపయోగించి ఎటువంటి రసాయన ఎరువులు వాడకుండా కూరగాయల సాగుతో ఎంతో ఆరోగ్యం, లాభదాయం అని వివరిస్తున్నారు.

ఈ విధంగా పండించే కూరగాయలకు ప్రస్తుతం ఎంతో డిమాండ్ ఉందని చెపుతున్నారు. రోజువారీ ఉపయోగాలకు అనంతరం మిగిలిన పండించే కూరగాయలను మార్కెట్‌లో విక్రయించుకొని ఉపాధి పొందవచ్చంటున్నారు. ఎంతో సులువుగా పండించ గలిగే పలు రకాల కూరగాయలు, ఆకు కూరలు, పప్పు ధినుసుల గురించి రైతులకు వివరిస్తున్నారు. మండలంలో ఇప్పటికే 637 మంది రైతులు 797.12 ఎకరాల్లో ఎటువంటి రసాయన ఎరువులు ఉపయోగించకుండా పప్పు ధినుసులు, వివిధ కూరగాయలను రైతులు పండిస్తున్నారు. ఎటువంటి రసాయన ఎరువులు ఉపయోగించకుండా పండిస్తున్న ఈ కూరగాయల వల్ల ఎంతో ఆరోగ్యం అని రైతు కుటుంబాలకు వివరిస్తూ సాగులో ప్రోత్సహిస్తున్నారు.

చురుగ్గా కెనాల్‌లో నాచు తొలగింపు



కొరువాడ మార్గంలోని సాగునీటి కాలువలో నాచు, మొక్కలను తొలగించే పనుల్లో లస్కర్లు

కె.కోటపాడు: రైవాడ కెనాల్ మార్గంలో నాచు, మొక్కలను తొలగించే పనులను జీవీఎంసీకి చెందిన లస్కర్లు చేపట్టారు. కొరువాడ నుంచి ఉగ్గినవలస కెనాల్ మార్గంలో ఈ పనులను గురువారం నిర్వహించారు. కెనాల్ మార్గంలో నాచు, మొక్కలు నీటి అడుగు భాగంలో పెద్ద ఎత్తున పెరగడం వల్ల ప్రవాహ వేగం మందగిస్తోంది. విశాఖ జీవీఎంసీకి సరఫరా కావాల్సిన 50 క్యూసెక్కుల నీటి ప్రవాహంలో అంతరాయం కలగకుండా నాచు, మొక్కలను తొలగించే పనులు చేస్తున్నట్లు సిబ్బంది తెలిపారు.

క్రమశిక్షణతో కూడిన బోధనతో ఉత్తమ ఫలితాలు

దేవరాపల్లి: క్రమశిక్షణతో కూడిన బోధన చేయడం ద్వారానే ఉత్తమ ఫలితాలు సాధిస్తున్నామని ప్రధానోపాధ్యాయిని వై. స్వర్ణలత అన్నారు. ఈ మేరకు ఎ.కొత్తపల్లి జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో విద్యార్థుల సంఖ్యలోను పెంచడంలో భాగంగా ఆడ్మిషన్ క్యాంపెయిన్ కార్యక్రమాన్ని గ్రామంలో సహచర ఉపాధ్యాయులు, గ్రామస్తులతో గురువారం ఆమె చేపట్టారు.

మూడేళ్లుగా తమ పాఠశాలలో పదో తరగతిలో శత శాతం ఉత్తీర్ణతతోపాటు తమ విద్యార్థులు ఉత్తమ మార్కులు సాధించారని తెలిపారు. తమ పాఠశాలలో ఎన్‌సీసీ, యోగా, మెడిటేషన్‌తోపాటు క్రీడలకు అత్యంత ప్రోత్సాహం అందిస్తున్నామన్నారు. ఎన్ఎంఎంఎస్‌కు ఎంపికైన పాఠశాల విద్యార్థిని టి. ఉషను హెచ్ఎం సహా ఉపాధ్యాయులు ప్రత్యేకంగా అభినందించారు.

ఈ స్కాలర్ షిప్ ద్వారా 9 నుంచి 12వ తరగతి వరకు నాలుగేళ్లపాటు రూ.15 వేల చొప్పున నగదు అందుతుందని తెలిపారు. ఈ కార్యక్రమంలో ఉపాధ్యాయులు, పాఠశాల కమిటీ సభ్యులు, గ్రామస్తులు తదితరులు పాల్గొన్నారు.

జీవాల పెంపకంలో శాస్త్రీయ యాజమాన్య మెలకువలు



మాట్లాడుతున్న పాడేరు డివిజన్ పశువైద్యశాఖ ఉప సంచాలకుడు నరసింహులు

మాడుగుల రూరల్: జీవాల పెంపకంలో శాస్త్రీయ యాజమాన్య మెలకువలపై పశువైద్యశాఖ పాడేరు డివిజన్ సహాయ సంచాలకుడు సిహెచ్. నర్సింహులు సారధ్యంలో గురువారం అవగాహన సదస్సు నిర్వహించారు. స్థానిక అగ్రిల్యాబ్‌లో జరిగిన ఈ సదస్సులో చీడికాడ, మాడుగుల మండలాలకు చెందిన పశువైద్యాధికారులు, పారావెట్ సిబ్బంది, పశుసంవర్ధక సహాయకులు, గోపాలమిత్రలు పాల్గొన్నారు. నరసింహులు మాట్లాడుతూ జాతీయ లైవ్‌స్టాక్ మిషన్ ఆధ్వర్యంలో లింగ నిర్ధారిత వీర్యం, రైతు భరోసా కేంద్రాలు క్లస్టర్స్ గ్రేడింగ్, 1962 అంబులెన్స్ సేవలు, గొంతువాపు, వ్యాధి నిరోధిక టీకాలు, శాఖాపరమైన అంశాలు గురించి వివరించారు. పశువులకు వచ్చే వ్యాధులు, నివారణ చర్యలు గురించి మాట్లాడారు. మాడుగుల ఏరియా పశువైద్య సహాయ సంచాలకుడు డాక్టర్ వి. చిట్టినాయుడు పాల్గొన్నారు.

ఠారెత్తించిన టమాటా

కశింకోట: స్థానిక వారపు సంతలో గురువారం టమాటా ధర భారీగా పెరిగింది. గత వారం కిలో రూ.40 ఉన్న టమాటా, ఈ వారం రూ.60కి పెరిగింది. ఉల్లిపాయ రూ.25 నుంచి రూ.30, బంగాళాదుంప రూ.30 నుంచి రూ.40కి పెరిగాయి. బీట్రూట్, క్యారెట్, బెండకాయ, వంకాయ, దొండకాయ రూ.40, బీరకాయ రూ.60కి విక్రయాలు సాగాయి.